“ఓ.కే. ..... ఫైనాన్స్ మేనేజర్‌తో చెప్తాను తీసుకో. బట్ ఒన్ క్వశ్చన్. యూనివర్సిటీ ప్రాపర్టీని నువ్వు డిస్ట్రాయ్ చేసినా, వాళ్ళు నీ మీదెందుకు లీగల్‌గా యాక్షన్ తీసుకోలేదో? పోలీసులకు కంప్లయింట్ చెయ్యలేదో- ఆలోచించావా?”

ఇంతవరకూ ఏ విషయంలోనూ ప్రశ్నలు వెయ్యని తండ్రి మొట్టమొదటి సారి ప్రశ్నిస్తున్నాడు. ఆ మార్పుని గుర్తించాడు మధుకర్.

“నీ గొప్పతనాన్ని గుర్తించి కాదు ..... అవునా ..... ?” రెట్టించాడు.

అవునన్నట్టుగా కళ్ళెత్తి తండ్రివేపు చూశాడు.

“నా తండ్రి పొలిటిషియన్ అని నన్నెవరూ గౌరవించలేదు. నా తండ్రి బిజినెస్ మాగ్నెట్ అని నన్నెవరూ గౌరవించలేదు. నా తండ్రి లక్షాధికారి అని నన్నెవరూ గౌరవించలేదు- అలా గౌరవించే వాళ్ళంటే నాకసహ్యం. నా తెలివితేటల్ని నమ్ముకుని, అమ్ముకుని నేనీ సొసైటీలో గుర్తింపుపొందాను. అలాంటి గుర్తింపే నేను ఎవరినుంచయినా కోరుకునేది కూడా. అలాగే నా ద్వారా నా కొడుకు గుర్తింపు పొందాలని నేను కోరుకోవడం లేదు. నా కొడుక్కో ఇండివిడ్యువాలిటీ వుందని నేననుకుంటాను. యామై రైట్” ఆగి కొడుకు కళ్ళల్లోకి చూసి-

“చూడు మధూ ..... ఇప్పటివరకూ నువ్వెన్ని విధ్వంసాలు చేసుంటావో ఆలోచించావా? కొన్ని లక్షలు విధ్వంసాలు ..... అంటే ..... నువ్వు చేసిన విధ్వంసాల వల్ల కొన్ని లక్షలు కాంపెన్సేషన్ కట్టాం-ఆ నష్టాన్ని మళ్ళీ లాభంగా మార్చడానికి నా తెలివితేటల్ని ఉపయోగించుకోవాల్సివస్తోంది. దానికోసం ఆలోచించాల్సి వస్తోంది. దానివల్ల ఎంత టైమ్ వేస్టవుతోందో నీకు తెలుసా? అదే టైమ్‌ని నేను బిజినెస్‌కి వుపయోగిస్తే ఇంకా బెటర్‌మెంట్ కనిపించేది అవునా ..... నువ్వెన్ని తప్పులు చేసినా నేనెందుకు వూరుకొన్నానో తెలుసా ..... నిజంగా ఎదిగే మనిషికి తప్పుల అవసరమే ఎక్కువుంది కాబట్టి. నేను స్వచ్ఛమైన మనిషని తిరిగేవాడెప్పుడూ స్వచ్ఛంగా వుండడు వుండలేడు. అదంతా నటనే, నువ్వు చేసే తప్పులగురించి ఇప్పటివరకూ నువ్వు ఆలోచించినట్లు కనబడలేదు కాబట్టి, ఇదంతా చెపుతున్నాను. దిసీజ్ మై లాస్ట్ అండ్ ఫైనల్ ఎడ్వయిజ్ ..... తెలిసి తప్పు చెయ్యకు. తప్పుచేసే పరిస్థితి తలెత్తినప్పుడు ఆ తప్పునుండి ఎలా బయటకు రావాలో ముందుగా ఆలోచించు. అర్థమైందా ఇంకోవిషయం ట్వంటీఫైవ్ లాక్స్ ..... కడతాను. అదీ ఒక

కండీషన్ మీద ..... " ఒక క్షణం ఆగాడు నాయుడు. ఆగి- "నేను రేపే నీకో ప్రపోజల్ చెప్తాను. ఏ పరిస్థితుల్లోనూ ఆ ప్రపోజల్‌ని నువ్వు ఒప్పుకుని తీరాలి ..... "

"అదెలాంటి ప్రపోజలో ..... ఒక అయిడియా కూడా ఇవ్వకుండా ఒప్పుకోమంటే ఎలా డాడీ?" ప్రశ్నించాడు మధుకర్.

"అది, నీ భవిష్యత్తుకు సంబంధించిందే ..... చాలా ..... ?" రెండు నిమిషాలు ఎవరూ మాట్లాడలేదు. పి.ఏ. రవికిరణ్ లెటర్స్ ఫైల్ తీసుకొచ్చాడు. వాటిమీద సంతకాలు చేస్తున్న సమయంలో వైస్ చాన్సలర్ దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది.

"ఓ.కే. ..... మీమాట నేనెప్పుడు కాదన్నాను, ట్వంటీ ఫైవ్‌తో పాటు మరో అయిదు ..... అలాగే ఒక చెక్కు, ఐదు క్యాష్ మా ఎఫ్.ఎమ్. తెచ్చిస్తాడు. బై దీ బై ..... మరి రీకన్‌స్ట్రక్టు చెయ్యడానికి, ఆ కాంట్రాక్టుని ఎవరికిస్తారు?"

"ఇది వరలో చేసినాయన వున్నాడు కదా ..... !" విసీ చెప్పాడు. రాఘవేంద్ర నాయుడు రీ కన్‌స్ట్రక్టు చేయటానికి కాంట్రాక్టు ఎవరికిస్తున్నారని ఎందుకు అడిగారో - ఏ ఉద్దేశ్యం మనస్సులో పెట్టుకుని అడిగారో తెలీని అమాయకుడేం కాదు విసీ.

అయితే తన బెట్టు తాను చేసి, తన ఎత్తు తాను వేస్తేగానీ తన కమిషన్ నిర్ధారించబడదని ఆయనకు బాగా తెలుసు. పొలిటీషియన్ వర్సెస్ బిజినెస్‌మెన్. కమీషన్ వర్సెస్ కాంట్రాక్టు ..... అదే విగ్రహాల్ని మరొకరు డిస్ట్రాయ్ చేసుంటే విసీకి బీపి, కోపం, కసి, ఉక్రోషం తన్నుకొచ్చేవే ..... కానిక్కడ డిస్ట్రాయ్ చేసింది మధుకర్ ..... అతను - నష్టాల్ని లాభంగా మార్చే జీనియస్‌కి ప్రాణం.

మామూలుగా తను రాఘవేంద్ర నాయుడుతో కొద్ది క్షణాలు కూడా మాట్లాడే అవకాశం ఉండదు. క్షణాల్ని లక్షల క్రింద మార్చే జీనియస్. కానిప్పుడు ఆ అవకాశం వచ్చింది.

విగ్రహాలు ధ్వంసం కావటం తన మంచికే వచ్చిందనుకుంటున్నాడాయన.

కొద్ది క్షణాల మౌనం తర్వాత-

"మీ యూనివర్సిటీకి స్థలం ఎంతుంది?" అన్నాడాయన గంభీరంగా.

సడన్‌గా టాపిక్ మార్చాడు. రాఘవేంద్ర నాయుడు ?!

"బహుశా రెండొందల యాభై ఎకరాలుండవచ్చు ..... "

రాఘవేంద్ర నాయుడు ప్రశ్నకు వైస్ చాన్సలర్ ఆశ్చర్యపోతూ సమాధానమిచ్చాడు.

"ఆ స్థలం పచ్చగా ఉంచ కుండా అలా బీళ్ళుగా వుంచటం మీ సామాజిక బాధ్యతను మీరు విస్మరించినట్టు కాదా? అందుకు కొంత ఖర్చుపెట్టి యూనివర్సిటీ మొత్తానికి పచ్చదనాన్ని తేవాలి కదా? మొక్కలు నాటండి పర్యావరణాన్ని రక్షించండని మరొకరికి చెప్పవలసిన మీ విద్యా సంస్థే ..... ఇతరులతో చెప్పించుకోవటం బాగోదు గదా?"

రాఘవేంద్ర నాయుడు వివరణకు, సూక్ష్మదృష్టికి వీసీ అప్రతిభుడే అయ్యాడు.

"ఎవరు పదవిలో ఉన్నా ..... తన పేరు ఏదో ఒక నిర్మాణాత్మక మైన ఆలోచన ద్వారా శాశ్వతం కావాలని కోరుకుంటారు గదా? ఉదాహరణకు ట్యాంక్‌బండ్ మీద ఎన్టీఆర్ పెట్టించిన విగ్రహాలు-మరికొన్ని శతాబ్దాల వరకూ ఎన్టీఆర్ శాశ్వతంగా రాష్ట్ర చరిత్ర పేజీలో మిగిలిపోతారు. అలాగే బుద్ధ విగ్రహం. అలాగే కరుణానిధి మద్రాసులో కట్టించిన అన్నా ఫ్లయి ఓవర్. అఫ్‌కోర్స్ ప్రభుత్వ ధనమే ..... కానీ పేరు వాటిని నిర్మింపజేసిన వ్యక్తులకే గదా వస్తుంది. అలాగే మీరు ఒక మరపురాని నిర్మాణాన్ని చేయాలి మీ పదవీ కాలంలో. మీరు చేయదగ్గది ఒకటుంది- లెజెండ్స్ ట్రెజర్ ..... అంటే అంతర్జాతీయ స్థాయి ఆడిటోరియమ్ ఒకటి నిర్మించాలి".

"వీటన్నిటి ప్రారంభోత్సవ సందర్భంలో మీరు పాల్గొంటారు- ఫౌండేషన్ స్టోన్స్ మీద - ప్రారంభోత్సవ స్థూపాలమీద మీ పేరు శాశ్వతం అయిపోయింది.

ఇవన్నీ మీరుండగా చేయిస్తే, మీకు లక్షలు కమిషన్‌గా అందుతాయి- డబ్బు అవసరం ఎవరికైనా ఉంటుంది- మీకు- మీ యూనివర్శిటీ రిజిస్టార్‌కీ, సెనేట్ మెంబర్స్‌కి - చాలా మందికి డబ్బు అవసరం వుంటుంది.

యూ నో ఒన్ థింగ్ ..... ఈమధ్య షార్జాలో జరిగిన క్రికెట్ పోటీలో ఇండియాకి గెలిచే అవకాశాలున్నా పాకిస్థాన్‌మీద ఎందుకు వోడిపోయిందో తెలుసా? డబ్బుకోసం అట-ఎంత దుర్మార్గం ..... ? మీది దుర్మార్గం కాదే ..... ?" రాఘవేంద్ర నాయుడు చెప్పటం ఆపాడు.

వీసీ దిగ్భ్రాంతికి గురయ్యాడు.

"నాకు చాలా కంపెనీలు రకరకాల పేర్ల మీదున్నాయి. ఆ పనులన్నీ నా కంపెనీలకే కాంట్రాక్టుగా ఇస్తే మీకొచ్చే లాభమేమిటో మీకు తెలియదనుకోను ..... " చివరగా చిన్నగా నవ్వుతూ అన్నాడు రాఘవేంద్ర నాయుడు.

"బాగానే వుంటుంది ..... బట్ ఫండ్స్ ..... " దిగ్భ్రాంతి నుంచి తేరుకుంటూ అడిగాడు వీసీ.

రాఘవేంద్ర నాయుడు చిన్నగా నవ్వాడు.

"అగ్రికల్చరల్, డ్రింకింగ్ వాటర్, అడల్ట్ ఎడ్యుకేషన్, వుమెన్ ఇన్ డైయిరీ శాఖలకు ఆ శాఖలే ఫండ్స్ ఇవ్వవు-వేరే సంస్థలు కూడా ఇస్తుంటాయి. ఫోర్డ్ ఫౌండేషన్, యూనిసెఫ్, నెదర్లాండ్స్, ఇండో -స్విస్ ప్రాజెక్ట్స్ ఇలా చాలా వుంటాయి అంతర్జాతీయ సేవా సంస్థలు. మీ యూనివర్సిటీ ఫండ్స్ చాలవని నాకు తెలుసు. యూజీసి వుంది- ఆపైన ఉదార సంస్థలున్నాయి. ఫండ్స్ తెచ్చుకోవటం చాతకావాలి- ఆ పనుల్ని మా స్టాఫ్ చూసుకుంటుంది. నా ఇన్‌ఫ్లుయన్స్ వుపయోగిస్తాను ..... ఆర్యూ హేపీ" కూల్‌గా అడుగుతుంటే ఉద్వేగానికి గురయ్యారు అటు వీసీ- ఇటు రవికిరణ్, మధుకర్.

"పాతిక లక్షల నష్టాన్ని ఎంత లాభంగా మార్చబోతున్నారు?" ఎగ్జయిటింగ్‌గా అడిగాడు వి.సి.

రాఘవేంద్ర నాయుడు చిన్నగా నవ్వాడు, సమాధానం ఇవ్వలేదు.

" ఓకే ..... ఓకే ..... ఇట్ మే బీ ట్రేడ్ సీక్రెట్ ..... నాకు అధికారం లేదు గానీ, ఉంటే మీరు నష్టాల్ని లాభాలుగా ఎలా మార్చుతారు ..... ?

How you was able to rise up from the ashes .... ? In times of great stress, adversity and losses. It is always best to keep busy with common-sense to plow your anger and your energy in to same thing positive & profits ....అనే మీ అనుభవాల్ని యూనివర్సిటీ లెవల్లో ఎమ్.బి.ఏ. స్టూడెంట్స్‌కి ఒక సబ్జెక్టుగా ఉంచేవాడ్ని.

Success is not a cold and grim business- It is a warm gratifying, thrilling and miraculous way of living that anyone can attai అని మీతో మన దేశంలోని నిరాశా, నిస్పృహలతో కృంగిపోయే యువతకు చెప్పించాలని వుంది.

మిమ్మల్ని కాలే పెనంమీంచి దొర్లిస్తే, లాభాల ఊబిలోకి జారతారు.

సైబిరియా ఎడారిని కూడా మీరు సస్యశ్యామలం చేయగలరు. హేట్సాఫ్ టూ యువర్ ఇంటిలిజెన్స్ ..... మీలాంటి మేధావితో నాకు స్నేహం ఉన్నందుకు నేను చాలా గర్విస్తున్నాను" అన్నాడు ఎగ్జయిటింగ్‌గా వీసీ.

"ఇప్పుడు చెప్పండి - వర్క్స్ కాంట్రాక్టు ఎవరికిస్తున్నారు?"

రాఘవేంద్ర నాయుడు తమాషాగా నవ్వుతూ పశ్నించాడు. రాఘవేంద్ర నాయుడు ఎప్పుడూ, ఎవ్వరినీ వెంటనే నాకీ పని చేసిపెట్టమని అడగడు- అవతల వ్యక్తికి తనతో కలిస్తే వచ్చే లాభాల గురించి చెప్పి, నవ్వి ఊరుకుంటారు ..... కథ దానంతట అదే మలుపు తిరుగుతుంది.

ఫోన్‌లో నవ్వాడు వీసీ. నవ్వి- "మీ తెలివి తేటలు ఇన్నాళ్ళకుగానీ, నాకు స్వయంగా తెలీలేదు సార్. టెండర్స్ కాల్ ఫర్ చెయ్యగానే ..... మీకు ఫోన్ చేస్తాను. ఈరోజే ఫైల్స్‌ని, ప్రపోజల్స్‌ని మూవ్ చేస్తాను."

ఫోన్ పెట్టేశాడు నాయుడు.

అసాధారణమైన తండ్రి తెలివితేటలకు మనస్సులోనే ఆశ్చర్యపడ్డాడు మధుకర్. పి.ఏ. రవికిరణ్ తెలుసు. నాయుడు ఇలాంటి మడతపేచీ ఏదో పెడతారని, అందుకే నవ్వాడు.

అంతా బాగుంది కానీ, తండ్రి తనకి ఆంక్షలు విధించినట్లుగా మాట్లాడడం నచ్చలేదు మధుకర్‌కి .....

"చూద్దాం ..... రేపటివరకు ..... "

ఆ గదిలోంచి బయటికొస్తూ అనుకున్నాడు మధుకర్.

* * * *

ఆ రాత్రి గడిచిపోయింది.

మరసటి రోజు ఉదయమే రాఘవేంద్ర నాయుడు దినచర్య ఒకింత దారి తప్పి వేరే ట్రాక్‌లోకి వెళ్ళింది. తన లెవెల్ సర్కిల్స్‌లోని వాళ్ళకు ఫోన్స్ చేసి, తన కొడుక్కి మంచి సంబంధం చూడమని చెప్పటంలో గంట గడిపాడు.

మధుకర్ పెళ్ళి చేస్తే దారిలోకి రావచ్చేమోనని తను ఏదో అనుకోకుండా చెప్పిన సలహాకే, రాఘవేంద్ర నాయుడు స్టిక్ అయిపోయాడా? ఒకటి అనుకుంటే దాన్ని పూర్తి చేసేవరకూ రాఘవేంద్ర నాయుడు నిద్రపోడు ..... రవికిరణ్ విస్మయంగా చూస్తూ అనుకున్నాడు మనస్సులో.

పెళ్ళి కావాల్సిన ఆడపిల్లలున్న కుటుంబాలలో ..... అదీ డబ్బున్న కుటుంబాలలో సంచలనం ..... ఉరుకులు ..... పరుగులు మొదలయ్యాయి.

* * * *

" మధుకర్‌కి వాళ్ళ నాన్న పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా ..... ? నిజమే?" తమాషాగా ప్రశ్నించింది మహతి.

ఫ్రెండ్స్ అవునన్నట్లు మౌనంగా తలూపారు.

* * * *

హాల్లో మూడీగా కూర్చున్నాడు మధుకర్.

"మన బార్‌లో మనం కూర్చోక, ఈ దిక్కుమాలిన బార్‌లో ఎందుకురా?"

చికాకుగా అడిగాడు నిధి దయాళ్.

"పెరడు చెట్టు మందుకి పనికిరాదు. అలాగే మన బారూ మందుకి పనికిరాదు-" విట్టు వేశాడు సురేష్.

"ఆ విజయ్‌గాడేడీ?" మూర్తి అసహనంగా అడిగాడు.

"వాడా ..... వాడి గర్ల్‌ఫ్రెండ్ ..... ఏదో సినిమా కెళ్తూ కనబడింది. అంతే వెనక పరుగెత్తాడు ..... "

"వాడికో గర్ల్‌ఫ్రెండ్ కూడానా ..... " ఆశ్చర్యం వ్యక్తం చేశాడు మూర్తి.

"కూడానా ..... అని దీర్ఘాలెందుకురా. వాడేం మగాడు కాడా?

ఆ సిన్మా ఏదో అయిపోగానే ఇక్కడికే తగలడతాడులే. అవునూ ..... మధుకర్‌ని మూడ్‌లోకి తేవాలంటే జోకులుండాలా? తప్పదా? సరే ..... నాకు తప్పుతుందా?

అయితే వినండి. ఓ జోక్ చెప్తాను. ఒరేయ్ మధూ విన్రా ..... సర్వర్ హాట్ డ్రింక్ తెచ్చేలోపు నా సాఫ్ట్ జోకులు వినండి" అంటూ మొదలుపెట్టాడు నిధి దయాళ్-

"ఓ సారి హిట్లరు ..... ఓ పిచ్చాసుపత్రిని చూడ్డానికి వెళ్ళాడట. హిట్లరు వెళ్ళి, ఆ ఆస్పత్రిలోని అన్ని వార్డుల్నీ తనిఖీ చేసాడు. హిట్లరుని చూడగానే ప్రతి పిచ్చివాడూ- హీ ..... హిట్లరు అని, హిట్లరు తన సైనికులకు అలవాటు చేసిన పద్ధతిలోనే సెల్యూట్ చేసారు. ఆ సెల్యూట్‌కి హిట్లరు చాలా ఆనందించాడు. పిచ్చివాళ్ళయినా , తనని గుర్తించినందుకు, గౌరవించినందుకు సదరు హిట్లరు చాలా సంతోషించాడు.

అందరూ తనకి సెల్యూట్ చేసారు కానీ, ఆ ఆస్పత్రి డాక్టర్ తనకి ఎందుకు సెల్యూట్ చెయ్యలేదో తెలీక, ఆఖరికి ఉండబట్టలేక అడిగేసాడట-

మిస్టర్ డాక్టర్ ..... నువ్వెందుకు నాకు సెల్యూట్ చెయ్యలేదు అని. ఆ డాక్టర్ ఒక్కసారి హిట్లరువేపు చూసి-

రెస్పెక్టు హిట్లూ ..... వాళ్ళకి పిచ్చుందిగానీ, నాకు లేదు కదా ..... అని అనగానే హిట్లరు ముఖం మాడ్చుకున్నాట్ట ..... ఎలా ఉంది జోకు.

“హిట్లరు మొహంలాగా, నీ మొహంలాగా ఉంది. జోకంటే కొంచెం నవ్వు రావాలిరా” అన్నాడు సురేష్.

“పోనీ నువ్వు చెప్పరా ..... చూస్తాను.”

సర్వర్ డ్రింక్స్ సర్వ్ చేసాడు. అందరూ హలోమని చీర్స్ చెప్పుకుని తాగడం మొదలుపెట్టారు.

డ్రింక్‌ని చప్పరించి నిధి దయాళ్ మరో జోక్ చెప్పాడు.

“ఓ ఫ్రెంచి బార్‌కి ఓ అమెరికన్ వెళ్ళాట్ట ..... ఆ అమెరికన్‌కి ఫ్రెంచి రాదు ..... అతనికేమో పుట్టగొడుగులు ఆర్డర్ చెయ్యాలని వుంది. మరి చెప్పడం ఎలాగో అర్థంకాలేదు. వెంటనే జేబులోంచి పాకెట్ నోట్ బుక్ తీసి, అందులోంచి ఓ పేపరు చింపి, దానిమీద పుట్టగొడుగు బొమ్మ వేసి సర్వర్‌కి నవ్వుతూ ఇచ్చాడు.

సర్వర్ అర్థమైందని, ఆనందిస్తూ వెళ్ళి అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చాడు.

“సర్వర్ ఏం తెచ్చాడో తెల్సా?” అందరివేపు చూస్తూ అన్నాడు నిధి దయాళ్.

“చెప్పు ..... ”

“గొడుగు”

అందరూ పోలోమని నవ్వారు. ఆ జోకుకి.

"బావుంది ..... బావుంది ..... " అన్నాడు సురేష్.

"జోకా ..... డ్రింకా" మూర్తి అడిగాడు.

"డ్రింక్" జవాబిచ్చాడు సురేష్

"ఇదిరా అసలు జోకు ..... " నవ్వారందరూ.

మధుకర్ సిగరెట్ మీద సిగరెట్ వెలిగిస్తూ, మొదటి పెగ్గు పూర్తి చేసేశాడు.

"రిపీట్ ది డ్రింక్" అని స్టీవార్ట్‌తో చెప్పాడు.

తనెంత ఫూలయ్యాడో తలచుకుంటే కోపం రెట్టింపై పోతోంది. తన పరిస్థితి తనకే అసహ్యంగా ఉంది. మహతి రెండుసార్లు దెబ్బతీసింది. మొదటిది డబ్బుతో పోయింది.